క్లుప్తంగా

భారత్ జట్టు విజయం సాధించాలని..



ప్రపంచ క్రికెట్ కప్ ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

పలమనేరు: ప్రపంచ క్రికెట్ కప్ ఫైనల్స్‌లో భారత్ విజేతగా నిలవాలని పలమనేరులోని వాణి విద్యాశ్రమం స్కూల్ విద్యార్థులు ఆకాంక్షించారు. వారు శనివారం ప్రపంచ కప్ ఆకారంలో కూర్చుని బెస్ట్ ఆఫ్ లక్ ఇండియా అని నినాదాలు చేశారు.

దోమల నివారణకు చర్యలు

కుప్పం: మున్సిపాలిటీ పరిధిలో దోమల నివారణకు ఫాగింగ్ చేపంటేందుకు మెషిన్‌ను ఏర్పాటు చేసినట్టు చైర్మన్ సుధీర్ తెలిపారు. ఆయన శనివారం మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలో ఫాగింగ్ మెషిన్‌ను ప్రారంభించారు. మున్సిపాలిటీలోని ప్రతి వీధిలోనూ ఫాగింగ్ చేయిస్తామని, ప్రజలు, కౌన్సిలర్లు అవసరమున్న చోట ఫాగింగ్ చేయించుకోవాలని సూచించారు.

నేడు మాలమహానాడు విజయోత్సవ సభ

పుంగనూరు: అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఆదివారం మాలమహానాడు విజయోత్సవ సభను నిర్వహించనున్నట్టు సంఘం కార్యదర్శి ఎస్.ఆర్.అశోక్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మదనపల్లె సీఎస్ఐ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మాలమహానాడు 25 సంవత్సరాల సంబరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన దళితులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాలమహానాడు మండల ఉపాధ్యక్షుడిగా గంగాధర



పలమనేరు: మాలమహానాడు మండల ఉపాధ్యక్షుడిగా మొరం గ్రామానికి చెందిన గంగాధరను నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు జైకుమార్ శనివారం నియామక పత్రం అందజేశారు. సంఘం అభివృద్ధి, ఎస్సీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నేతలకు గంగాధర కృతజ్ఞతలు తెలిపారు.

పేదల సంక్షేమానికి కృషి



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

సదుం: పేదల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తున్నట్టు రెడ్డివారిపల్లె సర్పంచ్ హనుమంతరెడ్డి తెలిపారు. రెడ్డివారిపల్లెలో శనివారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. గత ప్రభుత్వం హామీల పేరుతో మోసం చేసిన వైనాన్ని వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు ఆనందరెడ్డి, వెంకటస్వామి, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నేతలు

రామకుప్పం: మేజర్ పంచాయతీ రామకుప్పానికి చెందిన పద్మమ్మ శనివారం మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్సీ భరత్ స్థానిక సర్పంచ్ మురళీకృష్ణ, ఎంపీపీ సుబ్రమణ్యం ద్వారా బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని వారికి ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల కో–కన్వీనర్ చంద్రారెడ్డి, నేతలు కుందనందనరెడ్డి, ప్రసాద్, యశ్వంత్ రెడ్డి, నరేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

పలమనేరు బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్‌గా ఉమాపతి



పలమనేరు: బీజేపీ పలమనేరు నియోజకవర్గ కోకన్వీనర్‌గా పెద్దపంజాణి మండలం మాడికి చెందిన ఉమాపతిని నియమిస్తూ ఆ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి శనివారం ఉత్తర్వులిచ్చారు. ఉమాపతి అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

భక్తి శ్రద్ధలతో గ్యార్మీ పండుగ

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం రాత్రి గ్యార్మీ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముస్లింలు జెండాలను ఊరేగించారు. ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించి జెండాలను ప్రతిష్ఠించారు.

సమస్యల పరిష్కార వేదికలుగా సచివాలయాలు

- ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు
- త్వరితగతిన అందుతున్న ధ్రువీకరణ పత్రాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పలమనేరు: గతంలో కుల, ఆదాయ, స్థిర నివాస ధ్రువీకరణ పత్రాలతోపాటు ప్రభుత్వ పథకాల కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. దరఖాస్తుకు రూ.20 పెట్టాలి. దాన్ని పూర్తి చేసి వీఆర్వోకు అందజేస్తే ఎంతోకొంత ఇస్తేగాని పనిజరిగేది కాదు. నేడు ఆ పరిస్థితి మారింది. వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజలకు ఇళ్ల వద్దే సేవలు అందుతున్నాయి. దీనికి తోడు సమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా, రూపాయి ఖర్చు కాకుండా వలంటీర్ ద్వారా ఇంటికే చేరుతున్నాయి. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

545 సేవలు సచివాలయంలోనే..

ప్రస్తుతం సచివాలయాల్లో 545 సేవలు ఉండగా 400 వరకు సేవలు అందుబాటులో ఉన్నాయి. గతంలో మీ సేవా, కామన్ సర్వీసు కేంద్రాలు, డిజిటల్ సేవలను ప్రభుత్వం ఒకే గొడుకు కిందకు తెచ్చింది. ఆధార్ కరెక్షన్లు, ఎపిక్ సేవలు, లైఫ్ సర్టిఫికెట్, కిసాన్ క్రెడిట్ కార్డు, బీఎస్ఎన్ఎల్ సిమ్ కార్డులు, రీచార్జ్ వగైరాలు, పాన్‌కార్డు తదితర సేవలను పొందవచ్చు. ప్రభుత్వ సేవలకు సంబంధించి కరెంట్ బిల్లుల చెల్లింపులు, పాస్ పోర్టుకు దరఖాస్తు, రెన్యువల్స్, డ్రైవింగ్ లైసెన్సులు, ఓటర్ కార్డులు, గ్యాస్‌బుకింగ్, రెవెన్యూకి సంబంధించిన అన్ని రకాల సేవలు సచివాలయాల్లో పొందవచ్చు. అంతేకాకుండా విద్య, వ్యవసాయ, ఆరోగ్య, రవాణా, వాణిజ్య సేవలు అందుబాటులో ఉన్నాయి.

రిజిస్ట్రేషన్ సేవలు సైతం..

ఇప్పటిదాకా భూముల రిజిస్ట్రేషన్లలో డాక్యుమెంట్ రైటర్లే కీలకంగా వ్యవహరిస్తున్నారు. స్టాంపులు కొనుగోలు మొదలు రిజిస్ట్రేషన్ జరిగే వరకు వారు అడిగినంత ఇవ్వాల్సిందే. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి క్రయ, విక్రయదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ఈ సేవలను సైతం సచివాలయాల్లో అందుబాటులోకి తెచ్చింది. రిజిస్ట్రేషన్లపై ఇప్పటికే సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. ప్రభుత్వ సేవలు పొందే విధానాన్ని సులభతరం చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి దరఖాస్తులను తీసుకెళ్లి సర్టిఫికెట్లను తెచ్చి ఇవ్వడం గతంలో ఎన్నడూ లేదని ఆనందం చెందుతున్నారు.



బైరెడ్డిపల్లి గ్రామ సచివాలయాల సమూహం



ప్రజలకు అవసరమైన సేవల్లో సచివాలయ సిబ్బంది

మండలాల్లోని సచివాలయాలు:	92
పలమనేరు మున్సిపాలిటీలో సచివాలయాలు:	12
వీటి నిర్మాణాల కోసం పెట్టిన ఖర్చు:	రూ.50.60 కోట్లు
సచివాలయాల్లో అందుబాటులో ఉన్న సేవలు:	400కు పైగా
ఒక్కో సచివాలయంలో సిబ్బంది:	11 మంది

ఎంతో సౌకర్యంగా ఉంది



గతంలో పిల్లలకు సంబంధించి సర్టిఫికెట్ల కోసం పలమనేరు వెళ్లాల్సి వచ్చేది. ఒక రోజు పని వదులుకుని ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం మా పంచాయతీలోని సచివాలయంలోనే అన్ని సేవలూ అందుతున్నాయి. మాకు ఎంతో సౌకర్యంగా ఉంది. భవిష్యత్తులో ప్రజలకు సచివాలయాలు మరింత కీలకం కానున్నాయి.

– సుబ్రమణ్యం రెడ్డి, చెన్నుపల్లి, పలమనేరు మండలం

అన్ని సేవలూ సచివాలయాల్లోనే..



ప్రభుత్వ సేవల కోసం పట్టణాలకు వెళ్లకుండా వారి గ్రామాల్లోనే అన్ని రకాల సేవలు అందించేలా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే వందలాది సేవలను ప్రస్తుతం తాము సచివాలయాల్లోనే అందిస్తున్నాం. ప్రభుత్వం ప్రజలకు వ్యయప్రయాసలను తగ్గడంతో సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకుంది.

– మురళీనాథ్, వెల్ఫేర్ సెక్రటరీ, సముద్రపల్లి సచివాలయం

వైభవంగా అంబలం పూజ



అయ్యప్ప భజన చేస్తున్న భక్తులు

బైరెడ్డిపల్లె: మండలంలోని రామసముద్రంలో శుక్రవారం రాత్రి అంబలం పూజను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరటిబందెలు, విద్యుత దీపాలతో అలంకరించిన మండపంపై అయ్యప్పస్వామి, వినాయకస్వామి, సుబ్రమణ్యస్వామి చిత్రపటాలను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప మాల ధరించిన భక్తులు పూజల్లో పాల్గొని అయ్యప్ప భజన చేశారు.

ఘనంగా కవి సమ్మేళనం



కవులను సన్మానిస్తున్న గ్రంథాలయ అధికారి, సిబ్బంది

పలమనేరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా ప్రముఖ చరిత్రకారులు బత్తలపల్లి మునిరత్నం రెడ్డి పాల్గొన్నారు. ఆయన మూడు రాష్ట్రాల్లోని వందలాది ఆలయాల గురించి రాసిన పలు పుస్తకాలను గ్రంథాలయానికి అందజేశారు. అనంతరం మునిరత్నంరెడ్డి, సహజకవి వేమన్నను సన్మానించారు. ఇందులో సాహితీప్రియులు నందగోపాల్, లైబ్రేరియన్ హేమకుమార్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న దళిత నేతలు శంకరప్ప, రాజు, కృష్ణప్ప

పుంగనూరు: ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా పేద ప్రజలకు భూహక్కు కల్పించి, భూ యజమానులుగా మార్చిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని దళిత సంఘాల నేతలు తెలిపారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో శనివారం దళిత నేతలు ఎం.శంకరప్ప, రాజు, కృష్ణప్ప ఆధ్వర్యంలో థాంక్యూ సీఎం సార్ అంటూ పూలతో కృతజ్ఞతలు తెలిపారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో వేలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు భూమిపై హక్కు లభించిందన్నారు. బడుగు బలహీన వర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని మరోసారి రుజువైందని పేర్కొన్నారు. ఎంతోమందికి మేలుచేస్తున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని కోరారు. సర్పంచ్ అంజప్ప, దళిత నాయకులు సురేష్, కృష్ణప్ప, ఆనంద పాల్గొన్నారు.

మదర్‌థెరీసా ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా



అటానమస్ హోదా ఉత్తర్వులను ప్రిన్సిపాల్‌కు అందజేస్తున్న కరస్పాండెంట్ ఎం.రవీంద్రబాబు

పలమనేరు: పట్టణ సమీపంలోని మదర్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాలకు కేంద్ర విద్యామంత్రిత్వశాఖ అటానమస్ హోదాను కల్పించినట్టు కరస్పాండెంట్ ఎం.రవీంద్రబాబు శనివారం తెలిపారు. కళాశాలకు స్వయం ప్రతిపత్తి రావడంతో బీటెక్ కోర్సు సిలబస్‌ను ప్రస్తుత పరిస్థితులను అనుకూలంగా తయారు చేసుకోవడం, స్వయంగా పరీక్షలు నిర్వహించడం, ఫలితాలను వెల్లడించే అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. కళాశాలకు ఈ హోదా పదేళ్ల ఉంటుందని తెలిపారు. అటానమస్ రావడానికి కృషిచేసిన కళాశాల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది, అధ్యాపకులను అభినందించారు. కళాశాల చైర్మన్ ఎమ్మార్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

చెరువులో గల్లంతయిన వ్యక్తి మృతదేహం లభ్యం

రొంపిచెర్ల: మండలంలోని చిచ్చిలివారిపల్లె పంచాయతీ లోకవారిపల్లె చెరువులో చేపల కోసం వెళ్లి గల్లంతయిన వ్యక్తి మృతదేహం శనివారం లభించింది. గ్రామస్తుల కథనం మేరకు.. రావిళ్లవారిపల్లెకు చెందిన రెడ్డెప్ప కుమారుడు హరిప్రసాద్ (38) శుక్రవారం మధ్యాహ్నం చేపల కోసం వల వేశాడు. చెరువులో నీరు లోతుగా ఉండడంతో మునిగిపోయాడు. గ్రామస్తులు రొంపిచెర్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ కృష్ణయ్య అక్కడికి చేరుకుని చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి కావడంతో శనివారం ఉదయం గజఈతగాళ్లను రప్పించి వెతికించారు. శవం నీటిపై తేలడంతో వెలికితీసి పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హరిప్రసాద్ మద్యానికి బానిస కావడంతో అతని భార్య పిల్లలను తీసుకుని 10 సంవత్సరాల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. మృతుడి అన్న నాగరాజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

సాఫ్ట్‌బాల్ పోటీల విజేత శంకర్రాయలపేట జట్టు



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

పెద్దపంజాణి: పుంగనూరు జోనల్ క్రీడల్లో భాగంగా శనివారం మండలంలోని శంకర్రాయలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో సీనియర్ బాలికల విభాగంలో విన్నర్స్‌గా శంకర్రాయలపేట పాఠశాల జట్టు, రన్నర్స్‌గా అప్పినపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల జట్టు నిలిచినట్టు హెచ్ఎం వేదవతి తెలిపారు. బాలుర విభాగంలో విన్నర్స్‌గా అప్పినపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల జట్టు, రన్నర్స్‌గా శంకర్రాయలపేట పాఠశాల జట్టు విజయం సాధించినట్టు పేర్కొన్నారు. క్రీడాకారులను సర్పంచ్ హరినాథ్, వ్యాయామ ఉపాధ్యాయులు దొర్రై, తులసి, వంశీ, ఉదయ్, శివ, పవన్, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎరువుల కృత్రిమ కొరతపై ఆగ్రహం

- ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకం కావాలి
- డిసెంబర్‌కల్లా గృహ ప్రవేశాలకు సిద్ధం చేయండి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ దామోదరరాజు

చౌడేపల్లి: వ్యాపారులు కృత్రిమంగా ఎరువుల కొరతను సృష్టించి ఇష్టానుసారంగా విక్రయిస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నారని జెడ్పీటీసీ దామోదరరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ రామమూర్తి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ యూరియా బస్తాపై ఎంఆర్పీ కంటే అధికంగా రూ.100 నుంచి రూ.200 తీసుకుంటున్నా వ్యవసాయ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. సక్రమంగా పనిచేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు. సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. మండలానికి 2458 పక్కా గృహాలు మంజూరు చేశారని, వీటిలో 1453 పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఆయా లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించి గృహ ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో చాఫ్ కట్టర్లు రాయితీతో ఇస్తున్నారని, రైతులకు ఇతర ఖర్చులు లేకుండా కాంట్రాక్టర్ ద్వారానే విద్యుత్ పరికరాలు సరఫరా చేసేలా చూడాలని కోరారు. ఆర్టీసీ బస్టాండులోకి బస్సులు అన్నీ వెళ్లేలా చూడాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, సింగిల్ విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, ఎంపీడీవో సుధాకర్, తహసీల్దార్ మాధవరాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

సదుం: పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని హెచ్ఎం హేమలత తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం నడిగడ్డ ప్రభుత్వ పాఠశాలలో పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు నిత్యం గ్రంథాలయానికి వెళ్లాలని సూచించారు. గ్రంథాలయ అధికారి వెంకటరమణారెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

20న షాపు రూముల వేలం

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని బస్టాండు, ఉబేదుల్లా కాంపౌండులో ఉన్న రెండు షాపు రూములను ఈనెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్టు కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు నిబంధనల మేరకు దారావత్తు చెల్లించి, వేలంలో పాల్గొనాలని కోరారు.

20 వరకు రైతుల వివరాలు సేకరణ

గంగవరం: మండలాన్ని ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించిన నేపథ్యంలో వేరుశనగ నష్టపోయిన రైతుల వివరాల సేకరణను ఈ నెల 20 వరకు చేపట్టనున్నట్టు ఏవో హేమలత తెలిపారు. వివరాలను 21 నుంచి 25 వరకు సచివాలయం, రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శిస్తామని వెల్లడించారు. అభ్యంతరాలు ఉంటే రెవెన్యూ, వ్యవసాయ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు.

పక్కాగా కులగణన



అధికారులకు సూచనలిస్తున్న డీఎల్‌డీవో

చౌడేపల్లి: కుల గణనను పక్కాగా చేపట్టాలని డీఎల్‌డీవో ఉమావాణి ఆదేశించారు. ఆమె శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 27 నుంచి కుల గణన ప్రారంభమవుతుందన్నారు. వారం రోజుల్లో మండల వ్యాప్తంగా సర్వే పూర్తిచేయాలని సూచించారు. పారదర్శంగా వివరాలు సేకరించి వలంటీర్ లాగిన్ ద్వారా అప్‌లోడ్ చేయాలన్నారు. ఎంపీడీవో సుధాకర్, తహసీల్దార్ మాధవరాజు, ఏఎస్‌వో భూపతి తదితరులు పాల్గొన్నారు.

కులగణనపై సమీక్ష

పలమనేరు: పట్టణంలో ఈ నెల 27 నుంచి కులగణనను పటిష్ఠంగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ ఆదేశించారు. ఆయన శనివారం వార్డు సచివాలయాలు, మండలంలోని వెరిఫికేషన్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని బహిర్గతం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సర్వే వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవని చేస్తున్న ప్రచారం అవాస్తవమని పేర్కొన్నారు. ఈ సర్వేపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎంపీడీవో విద్యాసాగర్ పాల్గొన్నారు.

ననియాలలో ఏనుగుల సంచారం



రామకుప్పం: మండలంలోని ననియాల తండా పరిధిలో శనివారం రాత్రి ఏనుగులు సంచరించాయి. సమీప పంట పొలాలపై దాడి చేసి నాశనం చేశాయి. వాటిని అడవిలోకి తరిమేందుకు రైతులు ప్రయత్నించారు. అటవీ శాఖ అధికారులు స్పందించి ఏనుగుల కదలికలను ముందుగా గుర్తించి గ్రామాల వైపు రాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

సిమెంటు రోడ్డు నిర్మాణం



రామకుప్పం: మండలంలోని పెద్దతండా పంచాయతీ తులసీనాయక్ తండాలో రూ.20 లక్షల జీజీఎంపీ నిధులతో స్థానిక సర్పంచ్ మోహన్‌నాయక్ సిమెంటు రోడ్డు వేయించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ భరత్ తులసీనాయక్ తండాలో పర్యటించారు. ఆ సమయంలో గ్రామంలో సిమెంటు రోడ్డు వేయించాలని స్థానికులు కోరారు. స్పందించిన ఆయన నిధులు మంజూరు చేయించారు. సిమెంటు రోడ్డు వేయించిన భరత్, సర్పంచ్ మోహన్‌నాయక్‌ను స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కో–కన్వీనర్ చంద్రారెడ్డి, నేతలు బోర్‌వెల్ చెంగారెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

కడతట్లపల్లెలో వైద్యశిబిరం



బైరెడ్డిపల్లి: మండలంలోని కడతట్లపల్లెలో శనివారం వైఎస్సార్ ఫ్యామిలీ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శాలిని రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. తల్లిపాలు, వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత శుభ్రత గురించి వివరించారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్యుల సలహాలు తీసుకోవాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ సుబ్రమణ్యం

రామకుప్పం: గతంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించాలని సభ్యులు కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ సుబ్రమణ్యం అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తంచేశారు. బందార్లపల్లి సర్పంచ్ రాజ్‌గోపాల్ మాట్లాడుతూ మండలంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంలో హౌసింగ్ అధికారులు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. సకాలంలో బిల్లులు ఇవ్వడం లేదన్నారు. హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ సత్యనారాయణ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తామని తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శశిధర్ మాట్లాడుతూ మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 4554 మందికి, కంటి వెలుగు ద్వారా 438 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు చెప్పారు. బందార్లపల్లి పంచాయతీ సగినేకుప్పం పరిధిలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సర్పంచ్ రాజ్‌గోపాల్, ఎంపీటీసీ సౌమ్య కోరారు. తహసీల్దార్ మురళి మాట్లాడుతూ వెంటనే అర్హులకు ఇంటి పట్టాలు మంజూరు చేస్తామన్నారు. సర్పంచ్ మురళీకృష్ణ మాట్లాడుతూ రామకుప్పంలో నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని పంచాయతీకి తిరిగి అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ విజలాపురం బాబురెడ్డి, కో–కన్వీనర్ చంద్రారెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాధాకృష్ణ, కో ఆప్షన్ సభ్యుడు బరకతుల్లా, డీటీ దిలీప్ పాల్గొన్నారు.

24న మండల సర్వసభ్య సమావేశం

సదుం: ఈ నెల 24న మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ యల్లప్ప అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. సమావేశంలో మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై చర్చించనున్నట్టు తెలిపారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలతో హాజరుకావాలన్నారు.